క్లుప్తంగా

హోరాహోరీగా గిరకబండి పోటీలు



గెలుపొందిన రైతుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

కోసిగి: ఉగాదిని పురస్కరించుకుని మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామంలో మంగళవారం ఎద్దుల గిరకబండి లాగుడు పోటీలు నిర్వహించారు. మొత్తం 12 జతల ఎద్దులు పోటీలో పాల్గొన్నాయి. గ్రామానికి చెందిన ఎల్లప్ప గారి పెద్ద మల్లారెడ్డికి చెందిన ఎద్దులు విజేతగా నిలిచాయి. రైతుకు వీవీఎస్ యూత్ సభ్యులు బహుమతి అందజేశారు. గ్రామంలో ఈ ఏడాది మొదటిసారి గిరకలాగుడు పోటీలు నిర్వహించడంతో రైతులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు గర్జప్ప, హనుమంతు రెడ్డి, భీమేష్, సూర్య ప్రకాష్, సిద్ధ రమేష్, వెంకటేష్, నరసప్ప, భీమా రెడ్డి, సర్సింహులు పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి రూ. లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న దాతలు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయంలో రాజగోపుర నిర్మాణానికి కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన జాదేశెట్టి కుటుంబ సభ్యులు మంగళవారం రూ.లక్ష విరాళం అందజేశారు. వారికి ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీమఠంలో పంచాంగ శ్రవణం



పంచాంగ శ్రవణం గావిస్తున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో మంగళవారం పంచాంగ శ్రవణం చేశారు. క్రోధి నామ సంవత్సరంలో పరిస్థితులు, రుతువుల ప్రభావం, ప్రకృతి మార్పులు ఎలా ఉంటాయో భక్తులకు వివరించారు. పండిత కేసరి గిరియాచార్, ఆచార్యులు వాదిరాజాచార్ పాల్గొన్నారు.

ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి



విన్సెంట్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీటీ సభ్యులు

కోసిగి: ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 104వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కోసిగి, కౌతాళం, మంత్రాలయం మండలాల్లో ఆ సంస్థ ప్రతినిధి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఫెర్రర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

ఇఫ్తార్ విందులో ప్రదీప్‌రెడ్డి



ముస్లింలకు పండ్లు తినిపిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు: స్థానిక మదీనా మసీద్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు. నమాజ్ అనంతరం ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలకు పండ్లు, స్వీట్లు అందించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రవిచంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాముడు తదితరులు ఉన్నారు.

12 నుంచి కబడ్డీ పోటీలు

ఆస్పరి: మండలంలోని కైరుప్పలలో వీరభద్ర స్వామి, కాళికాదేవి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 12వ తేదీ నుంచి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రమేష్, చందు, వినోద్ మంగళవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.20 వేలు, వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల జట్లు ఈ నెల 11వ తేదీలోపు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వివరాలకు సెల్ 93460 89027, 62819 71243 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా ఉగాది సంబరాలు

- పట్టణంలో వెలసిన సుంకులమ్మ, మారెమ్మవ్వకు ప్రత్యేక పూజలు
- పిండి వంటలు, ఉగాది పచ్చడితో ప్రజల సంబరాలు
- అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న ప్రజలు
- పంటలు బాగా పండాలని భూమాతకు పూజలు



మారెమ్మవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఆరేకల్‌లో గుంటక పాస్తున్న రైతు

ఆదోని అర్బన్: ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆయా అమ్మవారి దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇళ్లల్లో పిండి వంటలు చేసుకుని నైవేద్యంతో ఆయా కాలనీల్లో వెలసిన సుంకులమ్మ, మారెమ్మవ్వ ఆలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించారు. చిన్నమార్కెట్‌లో వెలిసిన సుంకులమ్మవ్వ దేవి, మారెమ్మ దేవి, ఇస్వీ రోడ్డులో వెలిసిన మారెమ్మ దేవి, కొత్త బస్టాండు రోడ్డులోని సుంకులమ్మకు పట్టణ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలో వేచి ఉండి మొక్కులు చెల్లించి నైవేద్యం సమర్పించారు. వేకువజామున 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మవారి ఆలయాలు కిక్కిరిసిపోయాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శివనారాయణ స్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రణమండల కొండలో..

పట్టణ శివారులోని రణమండల కొండలో వెలసిన అంజనేయస్వామికి ఉగాది సందర్భంగా ఆలయ నిర్వాహకుడు టి.జి.పాండురంగయ్య శెట్టి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి సభ్యులు స్వామి వారికి పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసి, వడలహారం, నైవేద్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

ఆదోని రూరల్: క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆదోని మండలంలోని రైతులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో పూజా కార్యక్రమాలు చేపట్టారు. గతేడాది వర్షాలు ఆశించిన మేర లేకపోవడంతో అరకొర దిగుబడులు వచ్చాయి. ఈ యేడాది అనుకున్న సమయానికి వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుకుంటూ భూమాతకు పూజలు నిర్వహించారు. తెలుగు కొత్త సంవత్సరం పురస్కరించుకుని పొలాల్లో వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఎద్దులు ఉన్న రైతులు గుంటకను 9 లేదా 11 చుట్లు పాసి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఎద్దులు లేని రైతులు తమ పొలం చుట్టూ ముళ్ల కంపలను తొలగించారు. అలాగే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయా దేవాలయాల్లో నైవేద్యాలను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. తమ ఇంటి దైవాలకు ప్రత్యేక పూజలు చేశారు.

● కోటభద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో..



ప్రత్యేక అలంకరణలో కోటభద్రకాళి సమేత వీరభద్రస్వామి

పట్టణ శివారులోని కోటభద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరశైవ కులబాంధవులు పిండి వంటకాలతో స్వామి వారికి సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయాల్లో వేకువజాము నుంచి స్వామివార్లకు రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, వెండి, పూల అలంకరణలతో స్వామివార్లను అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

● మంగరాయ సన్నిధిలో..



వెండి ఆభరణాల అలంకరణలో మంగ రాయ ఆంజనేయస్వామి

పట్టణ శివారులోని మంగరాయ స్వామి సన్నిధిలో ఉగాది సంబరాలు ఘనంగా జరిగాయి. ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో మంగరాయ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. పంచామృతాభిషేకం, తేనాభిషేకం, వెండి ఆభరణాలు, తులసీహారం అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పంచాంగం పుస్తకాలకు పూజలు నిర్వహించారు. వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు.

ఉరుకుందలో పంచాంగ శ్రవణం



పూజల్లో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్

కౌతాళం: స్థానిక ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని క్రోధి నామ సంవత్సరం సందర్భంగా పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. ముందుగా అన్వేటి మండపంలో ఆలయ డిప్యూటీ కమిషన్ హెచ్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కౌతాళంకు చెందిన బద్రినాథ్‌స్వామి పంచాగం చదివి వినిపించారు. ఈ ఏడాది పంటలు సంమృద్ధిగా పండుతాయన్నారు. నర్మదా నది పుష్కరాలు ఉంటాయని తెలిపారు. అర్చకులను డిప్యూటీ కమిషనర్ సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు రామ్మోహన్‌రావు, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, ప్రధాన అర్చకుడు వీరప్పస్వామి, మహదేవస్వామి పాల్గొన్నారు.



పంచాంగ శ్రవణం చేసిన అర్చకులకు సన్మానం

కృష్ణావధూత స్వామి ప్రభోత్సవం



భక్తజనం మధ్య కృష్ణావధూత స్వామి వారి ప్రభోత్సవం



కోసిగి కాళికాదేవిని రథంపై కొలువుంచి ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామస్తుల ఆరాధ్య దైవం కృష్ణావధూత స్వాముల మహా ప్రభోత్సవం మంగళవారం వేలాది మంది భక్తుల మధ్య కనుల పండువగా సాగింది. ఉగాదిని పురస్కరించుకుని వేకువజామున నుంచి ఆర్లబండ అంబ భవాని ఆలయ పీఠాధిపతి మఠ్రిస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకు పూజ, వెండి కవచ అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామస్తులు స్వామివారికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మహిళలు కలశాలు, పూర్ణకుంభం, మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయం చెంతకు చేరుకున్నారు. స్వామివారికి పూజలు చేసి పీఠాధిపతి మఠ్రిస్వామి తులాభారం(నాణెలతో) నిర్వహించారు. అనంతరం పీఠాధిపతులను మహా ప్రభోత్సవంపై కూర్చొబెట్టి స్వామివారి పాదాల వరకు లాగి తిరిగి యథావిధిగా చేర్చారు. యువకులు నందికోళ్లు ఆడిస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా కాళికాదేవి రథోత్సవం

కోసిగి కడపాళెంవీధిలోని కాళికాదేవి ఆలయంలో అర్చకుడు గోపాలాచారి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని రథంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూరహారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఓరుగట్టు ఆంజనేయ స్వామి ప్రభోత్సవం



భక్తుల మధ్య స్వామివారి ప్రభోత్సవం

కోసిగి: మండల పరిధిలోని దుద్ది గ్రామంలో వెలసిన ఓరుగట్టు ఆంజనేయస్వామి ప్రభోత్సవం మంగళవారం రమణీయంగా సాగింది. ఆలయ అర్చకుడు మహాదేవప్ప తాత, బసవరాజు తాత ఆధ్వర్యంలో స్వామివారికి వేకువ జామున నుంచి జలాభిషేకం, ఫల, పుష్పాలంకరణ చేశారు. నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం మేళతాళాలు, భక్తుల హనుమాన్ నామస్మరణల నడుమ ప్రభోత్సవం జరిగింది. భక్తులకు అన్నదానం చేశారు.

నిందితుడి అరెస్ట్

ఆస్పరి: నగరూరు బస్టాప్ దగ్గర ఈనెల 7వ తేదీన రాత్రి మతిస్థిమితం సరిగాలేని మహిళపై అత్యాచారం చేసిన నిందితుడు రాముడును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆస్పరి సీఐ హనుమంతప్ప తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీ రాత్రి బిణిగేరికి చెందిన మతిస్థిమితం సరిగాలేని మహిళపై నగరూరు గ్రామానికి చెందిన రాముడు అనే వ్యక్తి అత్యాచారం చేశాడని, ఘటనపై బాధితురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ మేరకు నిందితుడిని మంగళవారం ఆస్పరి అంబేడ్కర్ సర్కిల్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

శ్రీరంగనాథుడి గ్రామోత్సవం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథుడిని మంగళవారం పల్లకీలో ఉంచి ఊరేగించారు.అర్చకులు రంగస్వామి స్వామి వారికి బిందెసేవ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

అర్చకులకు ఉగాది పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న అర్చకులతో కలెక్టర్ సృజన

పెద్దకడబూరు: క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకల్లో భాగంగా పెద్దకడబూరు మండల పరిధిలోని దొడ్డిమేకల ఆంజనేయస్వామి ఆలయ అర్చకుడు వి.సత్యనారాయణస్వామి, హెచ్.మురవణి గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయ అర్చకుడు నరసింహమూర్తి, మల్లికార్జునశర్మకు ఉగాది పురస్కారాలు లభించాయి. మంగళవారం కర్నూలులో కలెక్టర్ డాక్టర్ జి.సృజన చేతుల మీదుగా పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో కర్నూల్ జిల్లా అర్చక సమాఖ్య ప్రతినిధి మంత్రాలయం సూర్యనారాయణచార్యులు, దొడ్డిమేకల అర్చకులు రామ్మూర్తి, నందప్ప, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై చర్చకు సిద్ధమా !



మాట్లాడుతున్న ఏకాంబర్ రెడ్డి, నాయకులు

కౌతాళం: మండల పరిధిలోని ఉప్పరహాల్ గ్రామం నుంచి ఏ ఒక్క కార్యకర్త కూడా పార్టీ మారలేదని తెలుగుదేశం పార్టీలో చేరలేదని వైఎస్సార్‌సీపీ ఉప్పరహాల్ గ్రామ ఇన్‌చార్జి ఏకాంబర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లింగన్న, నాయకులు రాంగోవిందప్ప, విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఉప్పరహాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సోమవారం ఉప్పరహాల్ నుంచి 50 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. గ్రామంలో ఉన్న ఆ పార్టీ కార్యకర్తలనే తీసుకెళ్లి మళ్లీ పార్టీలో చేరినట్లు చూపించుకుంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని తెలిపారు. గతంలో మీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి గురించి ఇప్పుడు ఐదేళ్లలో గ్రామంలో జరిగిన అభివృద్ధి గురించి చర్చించడానికి రావాలన్నారు. గ్రామంలో రూ.8 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు. ఈ ఐదేళ్లలో ఎమ్మెల్యే గ్రామానికి 12నుంచి 15సార్లు వచ్చి ఉంటారని.. అది కూడా అభివృద్ధి పనులు ప్రారంభానికి, లేక భూమి పూజకు వచ్చారని, ఇంతటి అభివృద్ధి జరిగినా మీ కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

6 గడ్డివాములు దగ్ధం



బాధితులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దకడబూరు: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో 6 గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఈ ఘటన పెద్దకడబూరు మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితులు దుర్గన్న గారి మేషేక్, కుమ్మరి చిన్నఈరన్న, డేవిడ్, స్థానికుల వివరాల మేరకు.. గడ్డివాములు సమీపంలోని ఎమ్మిగనూరు ప్రధాన రహదారిలో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టారు. నిప్పు రవ్వలు గడ్డివాములపై పడడంతో మేషేక్‌కు చెందిన మూడు గడ్డివాములు (దాదాపు రూ.1.5లక్షలు), కుమ్మరి చిన్న ఈరన్న రెండు గడ్డివాములు (రూ.1లక్ష), డేవిడ్ గడ్డివాము (రూ. 50వేలు) కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి బాధితులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాముడు, గజేంద్రరెడ్డి ఉన్నారు.

కఠిన రోగాలకు తీపి వైద్యం!

- జిల్లాలో హోమియోకు ఆదరణ
- గతంతో పోలిస్తే పెరిగిన రోగులు
- జిల్లాలో 19 ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీలు
- అన్ని చోట్ల ఉచితంగా చికిత్స, మందులు
- దీర్ఘకాలిక జబ్బులకు, మొండి రోగాలకు చక్కటి వైద్యం
- నేడు వరల్డ్ హోమియోపతి డే

కర్నూలు(హాస్పిటల్): చాలా మంది జబ్బు చేసినప్పుడు మందులు వేసుకోవాలంటే ఇబ్బంది పడుతుంటారు. కొన్ని రకాల మందులు, సిరప్‌లు చేదుగా ఉంటాయని తిరస్కరిస్తుంటారు. కానీ ఏ వ్యాధికైనా తియ్యని గుళికలతో నాలుకకు, మనసుకు ఇబ్బంది లేకుండా మందును అందించే ఏకైక వైద్యవిధానం హోమియోపతి. ఈ వైద్యులు ఇచ్చే మందులు నోట్లో వేసుకోగానే కమ్మగా కరిగిపోతాయి. జర్మని దేశానికి చెందిన డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యుల్ హనీమన్ మొదటిసారిగా హోమియో విధానాన్ని కనుగొన్నారు. ఆయన 1755 సంవత్సరం ఏప్రిల్ 10న జన్మించారు. అందుకే ప్రతి ఏటా ఏప్రిల్ 10వ తేదీన హోమియో డేగా పిలుస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

హోమియోపతి ప్రాముఖ్యత

ప్రపంచ హోమియోపతి దినోత్సవం ఒక ముఖ్యమైన కార్యక్రమం. ఎందుకంటే ఇది ప్రత్యామ్నాయ వైద్యం గురించి అవగాహన పెంచుతుంది. ఏప్రిల్ 10న డాక్టర్ శామ్యూల్ హనీమన్ పుట్టిన రోజును పురస్కరించుకుని హోమియోపతి గురించి అవగాహన కల్పించేందుకు చాలా మంది ప్రజలు ఒకచోట చేరతారు. హోమియోపతి గురించి అవగాహన పెంచుకోవడానికి ఇది ఒక మంచి అవకాశం. సంపూర్ణ, రోగి-కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణ యొక్క ప్రాముఖ్యతను గుర్తించేందుకు ఇది ఒక అవకాశం. హోమియోపతి దీర్ఘకాలిక నొప్పి, అలర్జీలు, జీర్ణ రుగ్మతలతో సహా అనేక విభిన్న పరిస్థితులకు చికిత్స చేయడంలో ప్రభావవంతంగా ఉన్నట్లు నిరూపించారు. సంప్రదాయ వైద్యానికి బాగా స్పందించని దీర్ఘకాలిక పరిస్థితుల చికిత్సకు ఇది ప్రత్యేకంగా సరిపోతుంది. హోమియోపతి కూడా సురక్షితమైనది, సున్నితమైనది. కొన్ని దుష్ప్రభావాలతో, కఠిన మందులను నివారించాలనుకునే వ్యక్తులకు ఇది ఒక ప్రసిద్ధఎంపిక.

జిల్లాలో హోమియోపతి ప్రస్థానం

జిల్లాలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో రెగ్యులర్, ఎన్‌హెచ్‌ఎం కలిపి మొత్తం 19 హోమియో డిస్పెన్సరీలు ఉన్నాయి. రెగ్యులర్‌గా పత్తికొండ, పోలకల్, కర్నూలు, వెల్దుర్తి, నంద్యాల, జిల్లెల్ల, డి. బెళగల్, చనుగొండ్ల, క్రిష్ణగిరి, ఆత్మకూరు, పగిద్యాల, నేషనల్ హెల్త్ మిషన్‌లో చాపిరేవుల, పెద్ద ఎమ్మనూరు, డోన్, ఉలిందకొండ, పెద్ద తుంబళం, సున్నిపెంట, ప్యాపిలి డిస్పెన్సరీలు ఉన్నాయి. ఆయా డిస్పెన్సరీలకు ప్రతిరోజూ 35 నుంచి 50 మంది వరకు కొత్తగా రోగులు చికిత్స కోసం వస్తున్నారు. కర్నూలు, నంద్యాల, డోన్‌లాంటి చోట్ల ఓపీ రోగుల సంఖ్య దీనికి రెట్టింపుగా ఉంటోంది. అన్ని డిస్పెన్సరీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచే ఉంటాయి. ఇక్కడ చికిత్స, మందులు పూర్తిగా ఉచితం. దీంతో పాటు కర్నూలు నగరంలో పలు కార్పొరేట్ సంస్థలు అడుగుపెట్టడంతో హోమియో వైద్యవిధానానికి మరింత క్రేజ్ ఏర్పడింది. నగరంలో 12 నుంచి 16 దాకా కార్పొరేట్ సంస్థల ఆసుపత్రులు ఉండగా, స్థానిక వైద్యులు జిల్లా మొత్తంగా 650 నుంచి 700 మంది దాకా చికిత్స అందిస్తున్నారు. మొత్తంగా సగటున ఏడాదికి 6 లక్షల మంది దాకా హోమియో వైద్యాన్ని అందుకుంటున్నారు.




హోమియో వైద్య చికిత్సలో మందులు

మొండి రోగాలకు చక్కని పరిష్కారం !

హోమియో వైద్య విధానంలో మొండి రోగాలకు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఆదరణ పెరుగుతోంది. ఇతర వైద్య విధానాల్లో నయం కాని వారు హోమియోకు వచ్చి చికిత్స తీసుకుని వ్యాధిని నయం చేసుకుని వెళ్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇందులో ప్రధానంగా నడుంనొప్పులు, ఆర్థరైటిస్, చర్మవ్యాధులు, తరచూ వచ్చే చీముగడ్డలు, గజ్జి, తామర, ఎగ్జిమా, చెవిలో చీము కారడం , ముక్కుదిబ్బడ, గొంతునొప్పి, స్టాన్సిలైటిస్, నాజిల్ పాలిప్స్, గ్యాస్ట్రబుల్, మలబద్ధకం, పైల్స్, ఫిషర్, ఫిస్టులా, గాల్‌బ్లాడర్‌లో రాళ్లు, పసిరికలు, అమీబియాసిస్, నరాల సంబంధిత వ్యాధులు (సయాటిక, సర్వికల్ స్పాండిలోసిస్, లాంబార్ స్పాండిలైసిస్), కిడ్నీలో రాళ్లు, పలు రకాల అలర్జీలు, మైగ్రేన్లు, డిప్రెషన్, క్రానిక్ ఫెటిగ్ సిండ్రోమ్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ప్రకోప ప్రేగు సిండ్రోమ్, ప్రీమెన్ట్రసల్ సిండ్రోమ్ వంటి దీర్ఘకాలిక సమస్యలకు హోమియో మందులు బాగా ఫలితాలను ఇస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.


హోమియోపతి డిస్పెన్సరీల్లో ఉచితంగా చికిత్స



జిల్లాలో హోమియోపతి వైద్యానికి ఆదరణ పెరుగుతోంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ హోమియో డిస్పెన్సరిలలో రోగుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది. నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా హోమియో వైద్యానికి గత సంవత్సరంతో పోలిస్తే మందులు బాగా పెరిగాయి. హోమియో డిస్పెన్సరీల్లో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా చికిత్స, మందులు అందిస్తున్నాము. వరల్డ్ హోమియో డేను పురస్కరించుకుని అన్ని డిస్పెన్సరీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాము.

–డాక్టర్ టి.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఆయుష్ అధికారి, కర్నూలు

హోమియోపతి వైద్యంతో అద్భుత ఫలితాలు



హోమియోపతి మందుల ద్వారా అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులను శాశ్వతంగా నయం చేయవచ్చు. ఈ మందుల వల్ల ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ ఉండవు. ఎలాంటి నొప్పి, ఆపరేషన్ లేకుండా దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించవచ్చు. ప్రధానంగా థైరాయిడ్, పీసీవోడి, షుగర్, బీపీ, సొరియాసిస్, వెన్నునొప్పి, కీళ్లనొప్పులు, ఆర్థరైటిస్, మానసిక సమస్యలు తదితర ఆరోగ్య సమస్యలను హోమియో ద్వారా శాశ్వతంగా నివారించవచ్చు. ముందుగా రోగి మానసిక, శారీరక లక్షణాలు పరిగణనలోకి తీసుకుని కౌన్సిలింగ్ అందిస్తాము. ఆ తర్వాత వ్యాధి మూలకారణాలను గుర్తించి రోగికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తాము.

–డాక్టర్ విద్యాసాగర్‌రావు, ప్రభుత్వ హోమియోవైద్యులు, కర్నూలు